సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 11 । జూలై । 2025



టన్ను చీనీ రూ.18 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18 వేలు, కనిష్టం రూ.3 వేల ప్రకారం ధర పలికాయి.



ఆన్‌లైనా..? ఆఫ్‌లైనా!?

ఇంటర్ ఫలితాలు విడుదలై మూడు నెలలైనా డిగ్రీ ప్రవేశాలు ఆన్‌లైన్‌లో చేయాలా.. ఆఫ్‌లైన్‌లో చేయాలా అన్నదానిపై ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదు. 8లో

గరిష్టం/కనిష్టం
36.2°/22.9°

జిల్లా పరిధిలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా తగ్గింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

ట్రోలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

అనంతపురం: ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి తీర్పుపై సామాజిక మాధ్యమాల్లో ట్రోలింగ్ చేసిన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని అనంతపురం బార్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. బార్ కౌన్సిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని అన్ని కోర్టుల్లో న్యాయవాదులు విధులు బహిష్కరించి, నిరసనలో పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకట్రాముడు, ట్రెజరర్ వెంకట రఘుకుమార్, సంయుక్త కార్యదర్శి జుబేర్, మాజీ ఉపాధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది బడా నారాయణరెడ్డి, శ్రీకాంత్, అవ్వా సురేష్, ప్రణీత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మాయి వేధింపులతో మనస్తాపం

- ఆత్మహత్య చేసుకుంటానంటూ ఎస్పీకి అబ్బాయి సెల్ఫీ వీడియో



సెల్ఫీ వీడియోలో మాట్లాడుతున్న నారాయణస్వామి

గుత్తి: మండలంలోని రజాపురం గ్రామానికి చెందిన నారాయణస్వామి అనే యువకుడు ఓ అమ్మాయి వేధింపులు తాళలేక తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు రైలు పట్టాలపై గురువారం ఉదయం సెల్ఫీ వీడియో తీసి ఎస్పీ కార్యాలయానికి పోస్టు చేశాడు. డీపీఓ నుంచి సమాచారం అందుకున్న గుత్తి పోలీసులు సెల్ఫీ వీడియో ఆధారంగా రైలు పట్టాలపై పరుగు తీశారు. గుత్తి–అనంతపురం మార్గ మధ్యంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. యువకుడి సెల్‌ఫోన్ పామిడి వద్ద స్విచ్ఛాఫ్ అయినట్లు గుర్తించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ గాలించినా యువకుడి ఆచూకీ లభ్యం కాలేదు. గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

కేజీబీవీలో కోతుల హల్‌చల్



కూడేరు: స్థానిక కేజీబీవీలో కోతుల బెడదతో విద్యార్థులు బెంబేలెత్తిపోతున్నారు. గదుల్లోకి చొరబడి ట్రంక్ పెట్టెల్లోని దుస్తులు, ఇతర వస్తువులను లాగి పడేస్తున్నాయి. స్టోర్ గదిలోకి వెళ్లి వంట సామగ్రిని చెల్లాచెదురు చేస్తున్నాయి. తరగతి గదుల్లోకి చేరి బాలికలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. భోజనం సమయంలో తరిమేందుకు ప్రయత్నిస్తే దాడికి యత్నిస్తున్నాయి. అటవీశాఖ అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి కాపాడాలని విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది కోరుతున్నారు.

వేడుకగా గురుపౌర్ణమి

ప్రశాంతి నిలయం: జిల్లా వ్యాప్తంగా గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. సాయి ఆలయాలకు గురువారం భక్తులు పోటెత్తారు. భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు. అన్న ప్రసాదం స్వీకరించారు. వేడుకలను పురస్కరించుకుని మందిరాల్లో షిరిడీ సాయినాథునికి ప్రత్యేక పూజలు జరిగాయి. విద్యుద్దీప కాంతుల నడుమ ఆలయాలు కొత్త శోభను సంతరించుకున్నాయి.

విశ్వగురు సత్యసాయి..

అచంచలమైన ప్రేమ, భక్తి విశ్వాసాలను పంచిన విశ్వగురువు సత్యసాయి అని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అభివర్ణించారు. గురువారం పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం సత్యసాయి విద్యార్థుల వేదపఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం ప్రశాంతి భజన బృందం 'గురువందనం' కార్యక్రమం నిర్వహించారు. సత్యసాయిని కీర్తిస్తూ చక్కటి భక్తిగీతాలతో కచేరీ నిర్వహించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు నాగానంద గురుపౌర్ణమిని ఉద్దేశించి ప్రారంభోపన్యాసం చేశారు. సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ నిమిష్ పాండ్య ప్రసంగిస్తూ ఆత్మను గురువుకు కృతజ్ఞతతో లొంగిపోయి ఆరాధించడం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని, తద్వారా మానవ జీవితంలో మహిమాన్విత ఘట్టాలను పొందుతారన్నారు. కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ మాట్లాడుతూ ప్రేమ అనే భావన అచంచలమైనదని, ప్రకృతిలోని ప్రతి పుష్పం, చల్లటి గాలి కూడా ప్రేమతత్వాన్ని పంచుతాయన్నారు. కేంద్ర మంత్రిని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్ రాజు సన్మానించారు. కార్యక్రమంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు డాక్టర్ మోహన్, చక్రవర్తి, సత్యసాయి విద్యాసంస్థల విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.



హిందూపురం టీచర్స్‌కాలనీలో షిర్డీసాయినాథున్ని దర్శించుకుంటున్న భక్తులు

వంద మంది రైతులకు పనిముట్ల పంపిణీ..

గురుపౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని జిల్లాలో ఎంపిక చేసిన వంద మంది రైతులకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ చేతుల మీదుగా ఉచితంగా పనిముట్లను పంపిణీ చేశారు. అనంతరం శాంతిభవన్ అతిథి గృహంలో కేంద్ర మంత్రి పవిత్రమైన రుద్రాక్ష మొక్కలు నాటారు.



మడకశిరలో బాబా దర్శనం కోసం భక్తుల క్యూ



రైతులకు వ్యవసాయ పనిముట్లను అందజేస్తున్న కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

నకిలీ బంగారంతో బురిడీ

గుంతకల్లు: నకిలీ బంగారంతో ఫైనాన్స్ కంపెనీలను బురిడీ కొట్టిస్తున్న ముఠా గుట్టు రట్టయింది. ఇందుకు సంబంధించిన వివరాలను కసాపురం పోలీసుస్టేషన్‌లో గురువారం ట్రైనీ డీఎస్పీ అష్రఫ్ ఆలీ విలేకరులకు వెల్లడించారు. వివరాలిలా ఉన్నాయి. గుంతకల్లు పట్టణంలోని రాజేంద్రనగర్‌కు చెందిన తిమ్మయ్య గారి భార్గవ్ కుమార్, తెల్ల శివానంద్ బుధవారం 4 బంగారు గాజులు తీసుకుని పట్టణంలోని కరూర్ వైశ్య బ్యాంకులో తాకట్టు పెట్టేందుకు వెళ్లారు. గాజులను నకిలీవిగా గుర్తించిన బ్యాంకు అప్రైజర్ ఈ విషయాన్ని అసిస్టెంట్ మేనేజర్ వెంకటరెడ్డి దృష్టికి తీసుకెళ్లాడు. ఈ క్రమంలోనే వారిని నిలదీయగా అక్కడి నుంచి ఉడాయించారు. దీనిపై అసిస్టెంట్ మేనేజర్ ద్వారా ఫిర్యాదు అందుకున్న కసాపురం ఎస్ఐ వెంకటస్వామి వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. గురువారం కసాపురం రోడ్డులోని ఎస్‌బీఐ బజార్ బ్రాంచ్‌లో మరోసారి నకిలీ బంగారం కుదువ పెట్టడానికి భార్గవ్ కుమార్, శివానంద్ రాగా.. అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. ఈ క్రమంలోనే మొత్తం ముఠా గుట్టు రట్టయింది.

క్రాంతి కుమార్, వేణుగోపాల్ సూత్రధారులు

గుంతకల్లు పట్టణంలోని ఫక్కీరప్ప కాలనీకి చెందిన చాగంటి క్రాంతి కుమార్, కమ్మర వేణుగోపాల్‌లు నకిలీ బాగోతంలో సూత్రధారులుగా తేది. బంగారం వ్యాపారం చేసే వీరు సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో 70 శాతం సిల్వర్‌పై 30 శాతం బంగారు కోటింగ్ వేసి ఉంగరాలు, గాజులు తదితర వాటిని తయారు చేసేవారు. స్థానిక మోమినాబాద్‌కు చెందిన జావేద్‌తో నకిలీ బంగారంపై హాల్‌మార్క్ గుర్తు వేయించాక.. ముత్తూట్ ఫైనాన్స్, మణప్పురం, ఇతర ప్రైవేట్ బ్యాంకుల్లో తాకట్టు పెట్టి లక్షలాది రూపాయల రుణం తీసుకున్నట్లు విచారణలో వెల్లడైంది. కర్నూలుకు చెందిన ఎరుకల శ్రీనివాసులు, పులిపాటి నరేంద్ర, మేకల శ్రీనివాసులు, మల్లెమాల నరేష్‌కు కూడా నకిలీ బంగారం తక్కువ రేటుకు అమ్మేవాళ్లని తేలింది. నిందితులు 9 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 39 గ్రాముల నాలుగు బంగారు గాజులు, 13 నకిలీ బంగారు ఉంగరాలు, 5 వెండి ఉంగరాలు, 145 గ్రాముల కాపర్‌వైర్, 15 గ్రాముల వెండి కడియం, 4 వెండి కాళ్ల పట్టీలతోపాటు రూ.4 లక్షలు విలువ చేసే వెయింగ్ మిషన్ (హాల్‌మార్క్ ముద్ర వేసే)తోపాటు రూ.లక్ష నగదు స్వాధీనం చేసుకున్నట్లు ట్రైనీ డీఎస్పీ వివరించారు. నిందితుల అరెస్టులో ప్రతిభ చూపిన కానిస్టేబుల్స్ జాఫర్, కిషోర్‌కుమార్, ఓబులేసు, మహబుబ్‌బాషా, అశోక్, నజీర్‌లను అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ట్రైనీ డీఎస్పీ అష్రఫ్

'ఆర్థో'లో మృతిపై విచారణ

అనంతపురం మెడికల్: ఈ నెల 9న ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని ఆర్థో విభాగంలో చోటు చేసుకున్న యువకుడి మృతిపై ఆస్పత్రి అధికారులు విచారణ చేపట్టారు. ఉరవకొండ మండలం నింబగల్లు గ్రామానికి చెందిన రాజేష్ (22) కాలు నొప్పితో బాధపడుతూ తొలుత ఓ ప్రైవేట్ నర్సింగ్ హోంలో, అనంతరం సర్వజనాస్పత్రిలో చికిత్స పొంది మృతి చెందిన అంశంపై 'మేడా'లో అడ్మిషన్.. 'జీజీహెచ్'లో డెత్' శీర్షికన గురువారం 'సాక్షి'లో వెలువడిన కథనంపై జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం స్పందించారు. మృతిపై విచారణకు ఆదేశించారు. ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మరో ఇద్దరు ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్‌తో కమిటీను ఏర్పాటు చేశారు. మృతి గల కారాణాలపై నివేదిక సమర్పించాలని కోరారు. ఇదిలా ఉండగా స్వయంగా సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం తన సొంత మేడా నర్సింగ్ హోం నుంచి జీజీహెచ్‌కు బదిలీ చేసిన కేసులో రోగి మృతి చెందిన అంశంపై విచారణలో పారదర్శకత లోపించే అవకాశముందనే చర్చ జీజీహెచ్‌లో జోరుగా సాగుతోంది.

కరువు శాశ్వత పరిష్కారానికి చర్యలు



రాయలసీమ జిల్లాల కరువు నివారణ చర్యలపై సమీక్ష నిర్వహిస్తున్న కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

- కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్

ప్రశాంతి నిలయం: రాయలసీమలో కరువు నివారణకు శాశ్వత పరిష్కారం కనుగొనేందుకు చర్యలు చేపడదామని కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో దక్షిణ ఆంధ్రప్రదేశ్‌లోని కరువు పీడిత జిల్లాల సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా శివరాజ్‌సింగ్ చౌహాన్ పాల్గొని ప్రసంగించారు. కరువును శాశ్వతంగా పరిష్కరించాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం అన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు కలసికట్టుగా ఆలోచించి కరువు నివారణకు చక్కటి పరిష్కారం కనుక్కోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి, ఎన్ఆర్ఈజీఎస్, వాటర్‌షెడ్ తదితర పథకాల కింద ఎలాంటి చర్యలు తీసుకోవచ్చనే దానిపై చర్చించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. ఇతర శాఖల ద్వారా కూడా కరువు నివారణకు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగాలు, ఉద్యాన శాఖ పరిధిలో పరిస్థితుల గురించి తెలియజేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు, రాష్ట్ర హార్టికల్చర్ అండ్ సెరికల్చర్ కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ రాయలసీమ జిల్లాల్లో కరువు పరిస్థితి, వివిధ పంట సాగు వివరాలు, ఇరిగేషన్ అంశాలపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా తెలియజేశారు. బుందేల్‌ఖండ్ రీజియన్ మాదిరిగా రాయలసీమ జిల్లాలకు కూడా ఆర్థిక సహాయం ప్రకటించాలని, సీమ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, అనంతపురం జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ శర్మ, శ్రీసత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, కర్నూల్ జాయింట్ కలెక్టర్ నవ్య తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఆశల 'పరవళ్లు'

- హెచ్చెల్సీకి నీటి విడుదల
- రెండు రోజుల్లో సరిహద్దుకు చేరనున్న జలాలు

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయం నుంచి ఎగువ కాలువ (హెచ్చెల్సీ)కు గురువారం బోర్డు అధికారులు నీటిని విడుదల చేశారు. తుంగభద్ర బోర్డు సెక్రటరీ ఓ.ఆర్.కే రెడ్డి, డ్యాం ఎస్ఈ నారాయణ నాయక్, హెచ్చెల్సీ ఈఈ చంద్రశేఖర్ డ్యాం వద్ద స్విచ్ ఆన్ చేసి నీటి విడుదలను లాంఛనంగా ప్రారంభించారు. అంతకు ముందు బోర్డు అధికారులు డ్యాంపై పూజలు చేశారు. సంప్రదాయబద్ధంగా వాయనం వదిలారు. ఈ సందర్భంగా బోర్డు సెక్రటరీ ఓ.ఆర్.కే రెడ్డి, డ్యాం ఎస్ఈ నారాయణ నాయక్ మాట్లాడుతూ తుంగభద్ర ఎగువ కాలువకు తొలుత 100 క్యూసెక్కుల నీరు వదిలి తరువాత ప్రతి రెండు గంటలొకసారి నీటి విడుదలను పెంచుతామని తెలిపారు. కాలువకు 500 క్యూసెక్కుల నీరు వదులుతున్నట్లు పేర్కొన్నారు. ఆంధ్రా, కర్ణాటక కోటా కలిపి నీరు విడుదల చేస్తున్నామన్నారు. ఖరీఫ్‌లో పంటల సాగుకు ఈ నెల 10 నుంచి నవంబర్ 30 వరకూ దాదాపు 1,300 క్యూసెక్కులు వదులుతామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జూలై మొదటి వారంలోనే డ్యాం నుంచి నదికి నీటిని విడుదల చేశామన్నారు. డ్యాం గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 100 టీఎంసీలు కాగా ఇటీవల 80 టీఎంసీలకు కుదించామన్నారు. రైతులు నీటిని వృథా చేయకుండా వాడుకోవాలని సూచించారు. 12వ తేదీ సాయంత్రం 6 గంటలకల్లా ఆంధ్రా సరిహద్దులోని 105వ కిలోమీటర్‌కు తుంగభద్ర జలాలు చేరుతాయని అధికారులు తెలిపారు.



తుంగభద్ర ఎగువ కాలువలో పారుతున్న జలాలు

నిలకడగా ఇన్‌ఫ్లో..

గురువారం కూడా తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగింది. ఈ క్రమంలో 11 గేట్లను రెండున్నర అడుగుల మేర ఎత్తి 31,130 క్యూసెక్కులు నదికి, మరో 8,979 క్యూసెక్కులను హెచ్చెల్సీ, ఎల్లెల్సీ తదితర కాలువలకు వదులుతున్నారు. మొత్తంగా డ్యాంలో ఇన్‌ఫ్లో 45,944 కూసెక్కులు, ఔట్‌ఫ్లో 40,109 క్యూసెక్కులుగా నమోదైంది.

విషయాలు తెలియవంట..

గతంలో హెచ్చెల్సీకి నీటిని విడుదల చేస్తుంటే స్థానిక అధికారుల్లో హడావుడి ఉండేది. ఎక్కడైనా కాలువలు దెబ్బతిన్నాయా.. ముందు జాగ్రత్తలు తీసుకోవాలా.. అని పరిశీలించడంతో పాటు నీటి వినియోగంపై రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేవారు. ఈసారి మాత్రం బోర్డు అధికారులే వెంటపడుతుంటే నీటిని తీసుకోవడానికి హెచ్చెల్సీ అధికారులు ఇబ్బంది పడుతున్నారు. ఇన్‌చార్జ్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి విషయమే పట్టనట్లు ఉన్నారు. తాజాగా గురువారం నీటి విడుదలపై ఆయనను వివరణ కోరగా... హెచ్చెల్సీకి నీటిని విడుదల చేసినట్లు ఉన్నారని, మిగితా విషయాలు తనకు తెలియవని, బోర్డు అధికారులతో మాట్లాడి కనుక్కో అని చెప్పారు. దీన్ని బట్టి చూస్తే హెచ్చెల్సీ అధికారులు నిర్లక్ష్య వైఖరి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

తల్లిదండ్రుల స్పందన అంతంతే

మొక్కుబడిగా మెగా పీటీఎంలు

- గ్రామీణ ప్రాంతాల్లో ఆసక్తి చూపని తల్లిదండ్రులు
- ఫొటోలు, వీడియోలు అప్‌లోడ్ చేసేందుకే ప్రాధాన్యత
- చాలీచాలని నిధులతో హెచ్‌ఎం జేబులకు చిల్లు



చిలమత్తూరు మండలం లక్ష్మీపురం వద్ద నిర్వహించిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో నిరసన తెలుపుతున్న పంచాయతీ ప్రజలు



కనగానపల్లి కేజీబీవీలో పీటీఎంకు తక్కువ సంఖ్యలో హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు

కనగానపల్లి/ చిలమత్తూరు: రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో చేపట్టిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ (మెగా పీటీఎం–2.0)లకు జిల్లాలో స్పందన కరువైంది. వారం రోజులుగా కలెక్టర్ మొదలు విద్యాశాఖ, సమగ్ర శిక్ష అధికారులు పూర్తిగా ఈ కార్యక్రమం నిర్వహణపై తీవ్రస్థాయిలో కసరత్తు చేశారు. డీవైఈఓలు, ఎంఈఓలు, హెచ్‌ఎంల మెడపై కత్తిపెట్టి ఒత్తిళ్లు చేశారు. ఇంతచేసినా తల్లిదండ్రుల నుంచి స్పందన అంతంతమాత్రంగానే వచ్చింది. గురుపౌర్ణమి కావడం, మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువమంది రైతులు, కూలీ చేసుకునే పిల్లలు కావడంతో పనులు మానుకుని వచ్చేందుకు ఆసక్తి చూపలేదు. చాలా ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లోనూ ఫొటోలు తీయించి మమ అనిపించారు.

ఫొటోల అప్‌లోడ్‌పైనే ఆసక్తి..

కొన్ని ప్రభుత్వ స్కూళ్లలో ఫొటోల కోసం తల్లిదండ్రులను బలవంతంగా పిలిపించి వివిధ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల అభివృద్ధి, పురోగతిపై చర్చకంటే కూడా కార్యక్రమం నిర్వహించామా...ఫొటోలు, వీడియోలు అప్‌లోడ్ చేశామా పని అయిపోయిందా అనే విధంగా జరిగాయి. ప్రభుత్వ ప్రచారం కోసం తప్ప విద్యార్థులకు ఏమాత్రం ఉపయోగం లేదంటూ తల్లిదండ్రులు నిట్టూర్చారు. 'నాడు–నేడు' పనులు చేపట్టక ఎక్కడికక్కడ ఆగిపోయిన తరగతి గదుల గురించి కనీసం పట్టించుకోవడం లేదంటూ మండిపడుతున్నారు. పీటీఎంల నిర్వహణకు ప్రభుత్వం చాలీచాలని నిధులు కేటాయించడంతో అవి సరిపోక తమ జేబు నుంచి పెట్టుకోవాల్సి వచ్చిందని పలువురు హెచ్‌ఎంలు వాపోయారు.

- రాప్తాడు నియోజకవర్గం కనగానపల్లి కేజీబీవీలో సమావేశంలో ఎమ్మెల్యే పరిటాల సునీత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇక్కడ 200 మందికి పైగా విద్యార్థినులు ఉన్నారు. అయితే అందులో 50 మంది పేరెంట్స్ కూడా హాజరు కాకపోవడంతో సిబ్బందిపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు.
- హిందూపురం నియోజకవర్గ వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల్లో పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు జరగలేదు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల పాఠశాలల్లో తూతూమంత్రంగా సాగాయి. చిలమత్తూరు మండలంలోని లక్ష్మీపురంలో గతంలో పాఠశాల నిర్మాణానికి కేటాయించిన స్థలం మరొకరిది అంటూ పంచాయతీ కార్యదర్శి సావిత్రమ్మ తీర్మానం చేయడంపై ప్రజలు పేరెంట్స్ కమిటీ సమావేశంలో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఆ స్థలంలోనే ఎంపీపీ పురుషోత్తమరెడ్డి విద్యార్థుల కోసం సొంత డబ్బుతో తరగతి గదులు కూడా నిర్మించారన్నారు. ఇప్పుడు ఇతరులు సాగులో ఉన్నారంటూ పాఠశాలకు కేటాయించిన స్థలం స్వాధీనం చేసే ప్రయత్నాలు చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల స్థలం జోలికి ఎవ్వరూ రాకూడదంటూ ప్రజలు ముక్తకంఠంతో నినదించారు.

ఆన్‌లైనా? ఆఫ్‌లైనా!?

ఈ ఏడాది ఇంటర్ పరీక్ష ఫలితాలు ఏప్రిల్ 12న వెలువడ్డాయి. ఉత్తీర్ణులైన విద్యార్థులు డిగ్రీలో తమకు నచ్చిన గ్రూపులో చేరడానికి సన్నద్ధమయ్యారు. కానీ, ఫలితాలు వెలువడి మూడు నెలలు గడుస్తున్నా డిగ్రీ అడ్మిషన్లపై కూటమి ప్రభుత్వం ఎలాంటి నోటిఫికేషన్ జారీ చేయలేదు. ప్రవేశాలను గత ఏడాది మాదిరిగా ఆన్‌లైన్‌లో చేపడతారా?, లేకపోతే అంతకుముందు మాదిరిగా ఆఫ్‌లైన్‌లో చేపడతారా? అనేదానిపై స్పష్టత ఇవ్వలేదు. మరోవైపు కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు ఇప్పటికే అడ్మిషన్లు చేపట్టి, గోప్యంగా తరగతులు నిర్వహిస్తున్నాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా విద్యార్థుల్లో గందరగోళం నెలకొంది.

- డిగ్రీ ప్రవేశాలపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- ఇంటర్ ఫలితాలు విడుదలై మూడు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకూ విడుదల కానీ షెడ్యూల్
- ప్రభుత్వ ప్రకటన కోసం విద్యార్థులు, తల్లిదండ్రుల ఎదురుచూపు
- ఇప్పటికే అడ్మిషన్లు ప్రారంభించిన ప్రైవేటు కాలేజీలు



ఉమ్మడి జిల్లాలో ఎస్కేయూ పరిధిలో మొత్తం డిగ్రీ కళాశాలలు	86
ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు	13
ప్రైవేటు డిగ్రీ కళాశాలలు	73
మొత్తం విద్యార్థుల సంఖ్య	30 వేల వరకు

హిందూపురం టౌన్: ఉన్నత విద్యపై కూటమి సర్కార్ పూర్తిగా నిర్లక్ష్యం వహించింది. ఇంటర్ ఫలితాలు విడుదలై మూడు నెలలు కావస్తున్నా.. నేటికీ డిగ్రీ ప్రవేశాలకు సంబంధించి ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకపోవడమే ఇందుకు నిదర్శనం. గత ఏడాది కూడా ఉన్నత విద్యాశాఖ అడ్మిషన్ల ప్రక్రియను ఆలస్యంగా చేపట్టంతో అనేక కళాశాలల్లో పదుల సంఖ్యలో సీట్లు మిగిలిపోయాయి.

ప్రభుత్వ ఉన్నత విద్య నిర్వీర్యం..

2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ ఇప్పటి వరకూ ప్రారంభం కాలేదు. ఫలితాలు విడుదలైనప్పటి నుంచి డిగ్రీలో ప్రవేశాలకు మూడు నెలలుగా విద్యార్థులు ఎదురు చూస్తున్నా నేటికీ షెడ్యూల్ విడుదల కాలేదు. జూన్‌లోనే పాఠశాలలు, ఇంటర్ తరగతులు ప్రారంభమయ్యాయి. మరో వైపు డిగ్రీ కళాశాలలు కూడా నెల రోజుల క్రితమై పునఃప్రారంభమయ్యాయి. అయినా డిగ్రీలో అడ్మిషన్ల ప్రక్రియపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లాలో ఇప్పటికే పలు ప్రైవేటు, కార్పొరేట్ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టి, గుట్టు చప్పుడు కాకుండా తరగతులనూ నిర్వహిస్తున్నారు. అడ్మిషన్ల ప్రక్రియను ఆలస్యం చేయడం ద్వారా ప్రైవేట్ కళాశాలలు పుంజుకోగా, పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ కళాశాలలు వెనుకబడి పోతున్నాయి. కూటమి ప్రభుత్వ తీరుతో ఉన్నత విద్య నిర్వీర్యమవుతోందననే ఆరోపణలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

8 వేల మంది విద్యార్థుల ఎదురుచూపులు..

2025–26 విద్యాసంవత్సరంలో డిగ్రీలో అడ్మిషన్లు పొందడానికి జిల్లా వ్యాప్తంగా దాదాపు 8వేల మంది విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 2024–25 సీనియర్ ఇంటర్ ఫలితాల్లో 10వేల మందికిపైగా విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వీరంతా డిగ్రీలో చేరడానికి సిద్ధంగా ఉన్నారు. గత ఏడాది అడ్మిషన్ల ప్రక్రియను ఆలస్యంగా చేపట్టడంతో జిల్లా వ్యాప్తంగా చాలా కళాశాలల్లో 30 నుంచి 40 శాతం సీట్లు మిగిలిపోయాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది మరింత ఆలస్యంగా అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండడంతో ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు తగ్గే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

చెలగాటం వద్దు



ఇంటర్ ఫలితాలు విడుదలై మూడు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకూ డిగ్రీ అడ్మిషన్లపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. ఇప్పటికిప్పుడు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసి ప్రక్రియ ముగియాలంటే కనీసం రెండు నెలల సమయం పడుతుంది. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడకుండా వెంటనే డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేయాలి.

– కదిరీష్, జిల్లా ఉపాధ్యక్షుడు, వైఎస్సార్‌ఎస్‌యూ

ఉన్నత విద్య నిర్వీర్యం



కూటమి ప్రభుత్వ తీరు చూస్తుంటే ప్రభుత్వ ఉన్నత విద్యను నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్ కళాశాలలకు ఊతమిచ్చేలా ఉంది. డిగ్రీ ప్రవేశాలకు సంబంధించి ఇప్పటి వరకూ నోటిఫికేషన్ జారీ చేయకపోవడం బాధాకరం. ప్రభుత్వ తీరుతో జిల్లా వ్యాప్తంగా వేలాది మంది పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దల్లో మార్పు రావాలి.

– నరసింహమూర్తి, జిల్లా అధ్యక్షుడు, ఏఐఎస్‌ఎఫ్

అయోమయంగా ఉంది



ఇంటర్ పూర్తి చేసి మూడు నెలలవుతోంది. డిగ్రీలో చేరుదామంటే ఇంకా షెడ్యూల్ రాలేదని అంటున్నారు. మా తల్లిదండ్రుల్లోనూ టెన్షన్ ఎక్కువవుతోంది. డిగ్రీ అడ్మిషన్లపై అయోమయం వీడడం లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా షెడ్యూల్‌ను విడుదల చేయాలి.

– మంజునాథ్, విద్యార్థి

క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో శ్రీగిరి రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

పుట్టపర్తి టౌన్: పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం సాయంత్రం సత్యసాయి శ్రీగిరి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. అందంగా అలంకరించిన రథంపై సత్యసాయి చిత్రపటాన్ని ఉంచి ప్రశాంతి నిలయం ముఖ ద్వారం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథాన్ని లాగుతూ ఊరేగింపుగా విద్యాగిరి, గోకులం, ఎనుములపల్లి, గణేష్ కూడలి, చింతతోపు, గోవిందయ్యపేట, పెద్దబజార్ మీదుగా తిరిగి ప్రశాంతి నిలయానికి చేర్చారు. ఉత్సవంలో దేశవిదేశీ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పార్టీ అనుబంధ విభాగంలో చోటు



ధర్మవరం: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ మున్సిపల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ధర్మవరం పట్టణానికి చెందిన చందమూరి నారాయణరెడ్డి చోటు దక్కింది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

పట్టాలపై యువకుడి మృతదేహం



ధర్మవరం రూరల్: మండలంలోని చిగిచెర్ల గ్రామ సమీపంలో రైలు పట్టాలపై గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని గురువారం ఉదయం 7 గంటలకు స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. లేత నీలం రంగు టీ షర్ట్, నలుపు రంగు షార్ట్ ధరించిన 20 నుంచి 30 ఏళ్ల మధ్య వయసున్న యువకుడి మృతదేహం ఎడమ చేతిపై నేహా అనే పచ్చబొట్టును గుర్తించారు. అంతకు మించి ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి మృతి చెందాడా? లేక ఆత్మహత్య చేసుకున్నాడా? అనే కోణంలో దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మిస్సింగ్ కేసులో సంబంధీకులు ఎవరైనా ఉంటే 99513 25345లో సంప్రదించాలని ధర్మవరం రైల్వే పోలీసులు కోరారు.

నిడిగల్లు వాసికి జేఎస్‌డబ్ల్యూ ఫౌండేషన్ అవార్డు



పెద్దన్నకు అవార్డు అందజేస్తున్న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

తాడిమర్రి: మండలంలోని నిడిగల్లు గ్రామానికి చెందిన బీదాల పెద్దన్నకు జేఎస్‌డబ్ల్యూ ఫౌండేషన్ అవార్డు దక్కింది. బళ్లారి సమీపంలోని ఆదానీ సిమెంట్స్‌లో దక్షిణ భారతదేశ జోనల్ హెడ్‌గా పనిచేస్తున్న ఆయన, డాక్టర్ రమేష్ చంద్, నీతి ఆయోగ్ సభ్యులతో కలసి కంపెనీ సమీపంలోని గ్రామాల్లో 29 రైతు ఉత్పత్తిదారుల సంస్థలను బలోపేతం చేయడం, 65 వేల మందికి పైగా రైతుల జీవనోపాధుల మెరుగు పరచడంలో చేసిన కృషికి గాను అవార్డు దక్కింది. బుధవారం ఢిల్లీలో జేఎస్‌డబ్ల్యూ ఫౌండేషన్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) నిర్వహించిన కృషి విక్రమ్ – 2025 జేఎస్‌డబ్ల్యూ ఫౌండేషన్ అవార్డుల ప్రదానోత్సవంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా నిడిగల్లు వాసులు హర్షం వ్యక్తం చేశారు.

జేఏసీ కన్వీనర్ సాకే హరి అరెస్ట్



సాకే హరిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

పుట్టపర్తి టౌన్: ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ సమస్యపై ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసేందుకు వెళ్తున్న ఆర్డీటీ పరిరక్షణ సమితి జేఏసీ కన్వీనర్ సాకే హరిని పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం కొత్తచెరువు సీఎం పర్యటనలో ఆర్డీటీని కాపాడాలని జేఏసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేయాలని నిర్ణయించారు. సమాచారం అందుకున్న సీఐలు రెడ్డెప్ప, జయపాల్‌రెడ్డి తదితరులు సాకే హరిని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సమస్యలను సీఎంకు తెలియజేయడానికి చెప్పుకొనేందుకు వెళ్తున్న జేఏసీ నాయకులు, సభ్యులను పోలీసులు అరెస్ట్ చేయడం దారుణమన్నారు.

రైల్వే ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లు: రైల్వే ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి కార్మికులు, ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ కోరారు. గురువారం గుంతకల్లు రైల్వే ఆస్పత్రికి విచ్చేసిన దక్షిణ మధ్య రైల్వే ఛీఫ్ మెడికల్ డైరెక్టర్ నిర్మాల రాజరాంకు మెడికల్ బ్రాంచ్ సెక్రటరీ రమేష్‌తో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైల్వే ఆస్పత్రిలో ముఖ్యమైన సర్జన్, గైనకాలజిస్ట్ డాక్టర్లతో పాటు 7 నర్సింగ్ స్టాఫ్‌లు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఖాళీగా ఉన్న ఫార్మిసిస్ట్, ల్యాబ్ టెక్నిషియన్, ఈసీజీ టెక్నిషియన్ పోస్టులు భర్తీకి నోచుకోలేదన్నారు. ఇక్కడి నుంచి అనంతపురం, కర్నూలులోని కార్పొరేట్ ఆస్పత్రులకు రైల్వే ఉద్యోగులను మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేస్తున్నట్లు తెలిపారు. గుంతకల్లు పట్టణానికి సమీపంలో ఉన్న బళ్లారి సిటీలోని కార్పొరేట్ ఆస్పత్రికి రెఫరల్ అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అంతకముందు సీఎండీ నిర్మాల రాజరాం రైల్వే ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఓపీ విభాగాన్ని పరిశీలించి రోగులకు అందతున్న వైద్య సేవలపై ఆరా తీశారు.

‘ఉద్యాన’ పథకాలు వినియోగించుకోండి

హిందూపురం: ఉద్యానశాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలు, రాయితీలు, ప్రోత్సాహకాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని హిందూపురం డివిజన్ ఉద్యానాధికారి సుదర్శన్ పిలుపునిచ్చారు. ఉపాధి హామీ పథకం కింద పెద్ద ఎత్తున సబ్సిడీలు అందిస్తూ ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. నూతనంగా పండ్ల తోటల సాగుపై ఆసక్తి ఉన్న రైతులు రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఇక పాత తోటల పునరుద్ధరణ కింద ఖర్చులో 50 శాతం గరిష్టంగా రూ.24వేలు చొప్పున 2 హెక్టార్ల వరకూ రాయితీ అందజేస్తున్నట్లు వివరించారు. నీటికుంటల ఏర్పాటుపై 50 శాతం రాయితీ రూ.75వేలు మించకుండా వర్తింపజేస్తారన్నారు. సామూహిక నీటి కుంటల నిర్మాణానికి 75 శాతం రాయితీ రూ.18లక్షలు మించకుండా మంజూరవుతుందన్నారు. రక్షిత సేద్యం కింద అధిక విలువ కలిగిన పంటల నారు మొక్కలు పెంపకానికి ఖర్చులో 50 శాతంతో రాయితీ గరిష్టంగా 2,500 చదరపు.మీటర్ల వరకు చదరపు మీటరుకు రూ.225 చొప్పున రాయితీ వర్తిస్తుందన్నారు. కూరగాయలు, పండ్లు, కూరగాయల పండ్ల తోటలలో నాణ్యమైన అధిక దిగుబడులు సాధనకు ఖర్చులో 50 శాతం గరిష్టంగా హెక్టారుకు రూ.20వేలు వస్తుందన్నారు. అలాగే మామిడి, అరటి సాగులో పండు ఈగ నివారణకు కాయలకు ఫ్రూట్ కవర్స్ తొడిగే రైతులకు హెక్టారుకు రూ.5వేలు చెల్లిస్తారన్నారు. యాంటీ బర్డ్ పథకం కింద హెక్టారుకు రూ.48వేలు రాయితీ వర్తిస్తుందన్నారు. అర్హత కలిగిన పండ్లతోటల రైతులు ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లు, హెచ్‌ఓలు, ఉద్యానశాఖ కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

ఘర్షణ కేసులో 21 మంది అరెస్ట్



నిందితులను చూపుతున్న పోలీసులు

రాయదుర్గం: వివాహేతర సంబంధ కారణంగా ఆస్తి విధ్వంసాలకు పాల్పడిన 21 మంది యువకులను అరెస్ట్ చేసినట్లు రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఆయన వెల్లడించారు. బొమ్మనహాళ్ మండలం కొలగానహళ్లికి చెందిన అనంతరాజు కొంత కాలంగా అదే మండలం మైలాపురం గ్రామానికి చెందిన ఓ మహిళతో వివాహేత సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయంగా వివాదం తలెత్తి సోమవారం రాత్రి అనంతరాజుపై దాడి చేశారు. దీంతో కోపోద్రిక్తులైన అనంతరాజు, ఆయన బంధువులు మైలాపురం చేరుకుని లోకేష్, విజయ్ ఇళ్లల్లోకి చొరబడి తలుపులు, టీవీ, రెండు ద్విచక్రవాహనాలు, కారు ధ్వంసం చేయడంతో పాటు పది ట్రాక్టర్ల ఎండు గడ్డికి నిప్పు పెట్టారు. పరిస్థితి అదుపు తప్పడంతో ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు డీఎస్పీ రవిబాబు నేతృత్వంలో ఇరు గ్రామాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు... ఆస్తి నష్టానికి కారకులైన 21 మంది యువకులను గురువారం అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో హాజరుపరిచారు. కాగా, ఇదే కేసులో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనంతరాజును డిశ్చార్జ్ కాగానే అరెస్ట్ చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే అనంతరాజుపై దాడికి కారకులైన మైలాపురం గ్రామానికి చెందిన వారిని అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు. విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ నబీరసూల్, బొమ్మనహాళ్ పోలీసులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కదిరి టౌన్: ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు..తలుపుల మండలం మామిళ్లపల్లికి చెందిన రామచంద్ర(44) హైదరాబాద్‌లో వాచ్‌మెన్‌గా పనిచేసి జీవనం గడిపేవాడు. బుధవారం కదిరిలోని అడపాలవీధిలో ఉన్న తల్లి ఇంటికి వచ్చాడు. వ్యక్తిగత కారణాలతో ఇంటిలో ఎవరూ లేని సమయంలో విషగుళికలు మింగాడు. గమనించిన అతడి తల్లి, చుట్టుపక్కల వారు వెంటనే స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అనంతపురం తరలించారు. చికిత్స ఫలించకపోవడంతో అక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

టీ తాగుతూ కుప్పకూలి వ్యక్తి మృతి

గుత్తి: టీ తాగుతూ ఉన్నఫళంగా కుప్పకూలి ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. గుత్తి పట్టణంలోని కుమ్మర వీధిలో నివాసముంటున్న బోయ వేణు (45)కు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. బేల్దారి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. గురువారం తన స్నేహితులతో కలసి కర్నూలు రోడ్డులో ఉన్న రాజస్థాన్ హోటల్ వద్ద టీ తాగుతూ ఉన్నఫళంగా కుప్పకూలాడు. స్నేహితులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే వేణు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆయన మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

అనంతపురం: నగరంలోని ఓ హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసింది. వివరాలు... గుంతకల్లు మండలానికి చెందిన ఓ విద్యార్థిని నగరంలోని అరవిందనగర్‌లోని బీసీ హాస్టల్‌లో ఉంటూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతోంది. గురువారం ఆమెను కలిసేందుకు వచ్చిన తండ్రి సరిగా చదవడం లేదని మందలించాడు. అయితే అందరి ముందు మందలించడంతో మనస్తాపానికి లోనైన ఆమె తన గదిలోకి వెళ్లి విషపూరిత ద్రావకం తాగింది. తోటి విద్యార్థినిలు గమనించి వెంటనే సర్వజనాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం.

పలువురిపై కేసు నమోదు

యల్లనూరు: ఘర్షణ కేసులో పలువురిపై కేసు నమోదు చేసినట్లు పుట్లూరు సీఐ సత్యబాబు తెలిపారు. వివరాలను గురువారం ఆయన వెల్లడించారు. యల్లనూరు మండలం కూచివారిపల్లికి చెందిన జయకృష్ణ తండ్రి నాగేశ్వర్‌పై బొప్పేపల్లి గ్రామానికి చెందిన వెంకట్రాముడు గతంలో తిమ్మంపల్లిలో దాడి చేశాడు. ఈ విషయంగా కక్ష పెంచుకున్న జయకృష్ణ బుధవారం రాత్రి మద్యం మత్తులో బీరు సీసాతో వెంకట్రాముడిపై దాడి చేశాడు. దీంతో వెంకట్రాముడి తన కుటుంబసభ్యులు, బంధువులను పిలుచుకుని కూచివారిపల్లిలో జయకృష్ణ ఇంటిపై దాడి చేశాడు. టీవీ, తలుపులు, గేటు, బీరువా, ఫ్రిజ్ తదితర వస్తువులను ధ్వంసం చేశారు. ఘటనపై బాధితులు గురువారం రాత్రి ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ చేపట్టి, ఆస్తి నష్టానికి కారకులైన వెంకట్రాముడితో పాటు మరో 14 మందిపై కేసు నమోదు చేశారు.

కుక్క దాడిలో గొర్రె పిల్లల మృతి

బొమ్మనహాళ్: మండలంలోని కృష్ణాపురంలో వీధి కుక్క దాడిలో గొర్రె పిల్లలు మృతి చెందాయి. గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్న గ్రామానికి చెందిన రామన్న గురువారం తెల్లవారుజామున గొర్రెలను మేపునకు తీసుకెళుతూ.. పిల్లలను షెడ్‌లోకి వదిలి వెళ్లారు. ఉదయం అటుగా వెళ్లిన వీధి కుక్క షెడ్‌లోకి చొరబడి గొర్రె పిల్లలపై దాడి చేసింది. ఘటనలో 10 గొర్రె పిల్లలు చనిపోయాయి. దాదాపు రూ.70 వేలు నష్టం వాటిల్లినట్లు కాపరి రామన్న వాపోయాడు.

యువతి మిస్సింగ్ కేసులో వీడిన మిస్టరీ

పెద్దవడుగూరు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామానికి చెందిన యువతి మిస్సింగ్ కేసులో మిస్టరీ వీడింది. ఫిర్యాదు చేసిన 24 గంటల్లోనే ఆచూకీ పసిగట్టి తల్లిదండ్రుల చెంతకు యువతిని పోలీసులు సురక్షితంగా చేర్చారు. వివరాలను ఎస్‌ఐ ఆంజనేయులు గురువారం వెల్లడించారు. పామిడి మండలం గజరాంపల్లి వద్ద 44వ జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన ఓ గార్మెంట్స్‌లో పనిచేస్తున్న సదరు యువతి... అక్కడే పనిచేస్తున్న బిహార్‌కు చెందిన యువకుడితో సన్నిహితంగా ఉండేది. ఈ నేపథ్యంలో అతని మాయమాటలతో ఆకర్షితురాలైన ఆమె మంగళవారం సదరు యువకుడితో కలసి వెళ్లిపోయింది. ఘటనపై తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు బుధవారం మిస్సింగ్ కేసు నమోదు చేసిన పెద్దవడుగూరు పోలీసులు.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో కర్ణాటకలోని హాసన్‌లో ఉన్నట్లుగా తెలుసుకుని అక్కడకు చేరుకున్నారు. గురువారం యువతిని పిలుచుకొచ్చి సాయంత్రం తహసీల్దార్ ఉషారాణి సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు.

తహసీల్దార్ల సంతకాల ఫోర్జరీ!

- ‘అనంత’లో ఒకే రోజు మూడు మండలాల్లో వెలుగులోకి
- విచారణ జరపాలని పోలీసులకు ఫిర్యాదులు

కళ్యాణదుర్గం: నకిలీ ఈ– స్టాంప్‌ల కుంభకోణంతో రాష్ట్రాన్ని కుదిపేసిన కళ్యాణదుర్గం నియోజకవర్గంలో తాజాగా మండల మేజిస్ట్రేట్‌ల సంతకాల ఫోర్జరీ అంశం కలకలం రేపింది. ఒకరు కాదు ఇద్దరు కాదు... ఏకంగా ముగ్గురు తహసీల్దార్ల సంతకాలను ఫోర్జరీ చేసి నకిలీ డాక్యుమెంట్లను సృష్టించిన అంశం ఆలస్యంగా వెలుగు చూసింది. ఫోర్జరీ వ్యవహారంపై పోలీసులకు మూడు మండలాల తహసీల్దార్లు ఫిర్యాదులు చేశారు.

ఆ మూడు మండలాలే కీలకం

కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కంబదూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం మండలాల తహసీల్దార్ల సంతకాలు ఫోర్జరీ అయినట్లు ఆయా అధికారులు గుర్తించారు. సంతకాలు ఫోర్జరీ చేసి సృష్టించిన డాక్యుమెంట్లు బయటకు రావడంతో కంగుతిన్న అధికారులు ఈ అక్రమాల వెనుక ఉన్నదెవరనే అంశంపై ఆరా తీసే పనిలో పడ్డారు.

- కంబదూరు మండలం అండేపల్లి గ్రామంలో గ్రామ కంఠానికి చెందిన రెండు సెంట్ల స్థలాన్ని తహసీల్దార్ బాలకిషన్ సంతకం ఫోర్జరీ చేసి ఓ వ్యక్తి పత్రాలు సృష్టించుకున్నాడు. ఈ పత్రాల ఆధారంగా తన పేరున ఆ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు బుధవారం కళ్యాణదుర్గంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాడు. అయితే సదరు వ్యక్తి తెచ్చిన డాక్యుమెంట్లలో తహసీల్దార్ సంతకంలో తేడాలను గుర్తించిన సబ్ రిజిస్ట్రార్ నారాయణస్వామి వెంటనే విషయాన్ని తహసీల్దార్ బాలకిషన్‌కు చేరవేశారు. దీంతో కంగుతిన్న బాలకిషన్ వెంటనే తన సంతకం ఫోర్జరీ చేసి డాక్యుమెంట్లు సృష్టించిన వారిపై విచారణ చేయాలంటూ పోలీసులను ఆదేశించారు.
- బ్రహ్మసముద్రం మండలం ముద్దలాపురం గ్రామానికి చెందిన ఓ మహిళా రైతు తన పేరున ఉన్న భూమి తనకు తెలియకుండానే వెబ్‌ల్యాండ్‌లో లేకుండా చేశారంటూ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణ జరిపిన తహసీల్దార్ సుమతి... తన సంతకం ఫోర్జరీ చేసి నకిలీ డాక్యుమెంట్లతో వెబ్‌ల్యాండ్‌లో ఆ భూమిని మరొకరి పేరుపై మార్చినట్లు గుర్తించారు. ఈ అంశంపై విచారణ చేయాలంటూ పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారు.
- కళ్యాణదుర్గం మండలంలో ఓ వ్యక్తి తన స్థలంపై బ్యాంకులో రుణం తీసుకునేందుకు భూమి హక్కు పత్రాలు తీసుకుని తహసీల్దార్ భాస్కర్ వద్దకు వచ్చాడు. అయితే సదరు వ్యక్తి వద్ద ఉన్న డాక్యుమెంట్లలో సంతకం ఫోర్జరీ అని తహసీల్దార్ గుర్తించారు. ఈ విషయంపై తహసీల్దార్ సదరు వ్యక్తిని ఆరా తీయగా తనకు ఏమీ తెలియదని డాక్యుమెంట్ రైటర్ వద్దకెళితే ఈ పత్రాలు ఇచ్చాడంటూ సమాధానమిచ్చినట్లు తెలిసింది. దీంతో అప్రమత్తమైన తహసీల్దార్ పట్టణ సీఐ యువరాజ్‌కు ఫిర్యాదు చేశారు. పూర్తి స్థాయిలో విచారణ చేసి అసలు దోషులను గుర్తించాలని సూచించారు.

రంగంలోకి పోలీసులు

తమ సంతకాలు ఫోర్జరీ చేసి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించిన అంశంపై మూడు మండలాల తహసీల్దార్లు ఒకే రోజు చేసిన ఫిర్యాదుతో పోలీసులు రంగంలో దిగారు. డీఎస్పీ రవిబాబు ఆదేశాలతో ఆయా మండలాల సీఐలు, ఎస్‌ఐలు అసలు దోషులను గుర్తించే పనిలో పడ్డారు. ఇప్పటికే కళ్యాణదుర్గం, కంబదూరు మండలాల తహసీల్దార్ల వద్దకెళ్ళిన వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఈ– స్టాంప్ కుంభకోణం మరువకముందే తహసీల్దార్ల సంతకాల ఫోర్జరీ అంశం వెలుగు చూడడం గమనార్హం. రెండు రోజులుగా ఈ అంశం నియోజకవర్గ కేంద్రంలో హాట్ టాపిక్‌గా మారింది. దీని వెనుక టీడీపీ నేతల హస్తముందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అసలు సూత్రధారులను పట్టుకోవాలి

నా సంతకం కోసం కార్యాలయానికి వచ్చిన వారు అమాయకులు. వారికి ఏమీ తెలియదు. వారిని తప్పుదోవ పట్టించిన అసలు సూత్రధారులను పట్టుకోవాలి. మండల మేజిస్ట్రేట్ హోదాలో ఉన్న తహసీల్దార్ల సంతకాలే ఫోర్జరీ చేస్తున్నారంటే ఇది మామూలు విషయం కాదు. దీనిపై పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి దోషులను గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలి.

– భాస్కర్, తహసీల్దార్, కళ్యాణదుర్గం

విచారణ చేస్తున్నాం

తహసీల్దార్ల సంతకాలను ఫోర్జరీ చేసి నకిలీ డాక్యుమెంట్లను తయారు చేసిన వారి ఆచూకీ కోసం గాలిస్తున్నాం. ఇప్పటికే కళ్యాణదుర్గం తహసీల్దార్ సూచించిన సదరు బాధితులతో మాట్లాడి పలు విషయాలను రాబట్టుకున్నాం. నకిలీ డాక్యుమెంట్లు ఎవరు ఇచ్చారు? వారి వెనుక ఉన్న వారు ఎవరు? ఎన్ని డాక్యుమెంట్లు ఇలా ఫోర్జరీ సంతకాలతో తయారు చేశారు అనే కోణంలో విచారణ చేస్తున్నాం. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తాం.

– యువరాజ్, సీఐ, కళ్యాణదుర్గం